# సుబ్బారావు అమర్ హై

పౌరహక్కుల ఉద్యమంలో దాదాపు రెండు దశాబ్దాలపాటు చురుకైన పాత్ర నిర్వహించిన సి.వి. సుబ్బారావు జనవరి 17 రాత్రి ఢిల్లీలో మరణించాడు. సుబ్బారావు ఢిల్లీలో ఉన్న పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ (PUDR) వ్యవస్థాపక సభ్యుడు. చనిపోయిన నాటికి ఆ సంస్థ కార్యదర్శి. 1974లో ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల సంస్థ ఏర్పాటుకు గుంటూరులో జరిగిన సమావేశానికి కూడా సుబ్బారావు హాజరయ్యాడు. 1984-86 మధ్య కాలంలో హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చురుకుగా పనిచేసాడు.

1970 దశకంలో జాతీయ స్థాయిలో పౌర హక్కుల ఉద్యమంలో విభిన్న దృక్పథాల మధ్య చెలరేగిన చర్చలో సుబ్బారావు ప్రముఖమైన పాత్ర నిర్వహించాడు. ఆనాడు పౌరహక్కుల ఉద్యమంలో రెండు ప్రధానమైన దృక్పథాలు ఉండేవి. అప్పట్లో చాలామంది, ప్రత్యేకించి ఢిల్లీలో, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కాపాడటమే పౌరహక్కుల సంస్థల ప్రధాన లక్ష్యమని భావించారు. దాన్నే ఎంచుకున్నారు. ఇందుకు భిన్నంగా PUDR ఏర్పాటుకు చొరవ తీసుకున్న సుబ్బారావు విభిన్న రూపాల్లో సామాజిక, ఆర్థిక ఆధిపత్య వర్గాల కింద నలిగిపోతున్న పేద ప్రజలు, జీవితంలో సుఖ సంతోషాల్ని పెంపొందించుకోవటానికి, కనీస జీవన ప్రమాణాలను సాధించుకోవటానికి పోరాటం చేసే హక్కు కలిగి ఉంటారని, ఆ హక్కును కాపాడటమే పౌర హక్కుల సంఘం ప్రధాన లక్ష్యమని వాదించాడు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు జీవితాన్ని మెరుగు పర్చుకోవటానికి సాధనాలే తప్ప అలంకార ప్రాయమైనవి కావు. అంటే ఆదేశిక సూత్రాలను ప్రాథమిక హక్కుల్లో భాగంగా చూడాలన్నమాట. పి.యు.డి.ఆర్ ఏర్పాటుతో ఈ ధోరణి ఢిల్లీకి విస్తరించింది.

ఢిల్లీలో పి.యు.డి.ఆర్ ఏర్పాటు పౌరహక్కుల ఉద్యమంలో చాలా కీలకమైన ఘట్టం. దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ప్రజల, ప్రజా ఉద్యమాల అణచివేతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, ప్రచారం చేయటానికి పి.యు.డి.ఆర్. ఏర్పాటుతో ఢిల్లీలో ఒక వేదిక రూపొందింది. పి.యు.డి.ఆర్. ఏర్పాటులోనే కాక, దాని కార్యకలాపాలలో సుబ్బారావు కీలకమైన పాత్ర నిర్వహించాడు. ఆసియాడ్ గ్రామాన్ని కట్టిన వలస కార్మికుల పని పరిస్థితులు, వివిధ ప్రాజెక్టుల వలన బస్తర్ ఆదివాసులు నిర్వాసితులయిన క్రమం, బీహార్, ఆంధ్ర విప్లవకారులపై రాజ్య యంత్రాంగం అణచివేత చర్యలు వంటి అనేక విషయాలు సుబ్బారావు చొరవతో పి.యు.డి.ఆర్ వేదిక నుంచి వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకించి ఎపిసిఎల్‌సి పైన నిర్బంధం వచ్చినప్పుడల్లా ఢిల్లీ విశ్వ విద్యాలయానికి, ఢిల్లీ నగరంలోని ఇతర సంస్థలకు చెందిన మేధావుల అభిప్రాయాలను సమీకరించి రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తేవటానికి పి.యు.డి.ఆర్. చేసిన కృషిలో సుబ్బారావు పాత్ర చాలా ఉంది.

సుబ్బారావు పౌరహక్కుల ఉద్యమకారుడు మాత్రమే కాదు. విద్యార్థిగా ఉన్నప్పుడు విద్యార్థి ఉద్యమాలలో కృషి చేసాడు. రాడికల్ విద్యార్థి సంఘం వ్యవస్థాపక సభ్యుడు, మొదటి ఉపాధ్యక్షుడు. వి.ర.సం. ఆవిర్భావానికి ప్రేరణ అయిన విశాఖ విద్యార్థుల్లో ఆయన ఒకడు. విరసం సభ్యుడు. 'సృజన' సాహితీమిత్రుల్లో ముఖ్యమైన వాడు. ఆర్థిక శాస్త్రవేత్తగా ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ అసోసియేషన్‌లో, విశ్వవిద్యాలయ మేధావుల్లో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. సుబ్బారావు ఈశాన్య భారత దేశంలోని ప్రజల సమస్యలను వివరిస్తూ 'రగులుకున్న రాక్షసి బొగ్గు', రాజకీయార్థిక శాస్త్రాన్ని తెలుగు పాఠకులకు మొదటిసారిగా వివరిస్తూ 'రాజకీయార్థిక శాస్త్రం - ఒక పరిచయం' అనే పుస్తకాలు రాశాడు. తెలుగు సాహిత్య విమర్శపై ఆయన సంపాదకత్వంలో 'విభాత సంధ్యలు' అనే పుస్తకం అచ్చయింది.

వ్యక్తిగత జీవితంలో కూడా ప్రజాస్వామిక విలువలను పాటించడం అవసరమని సుబ్బారావు భావించేవాడు. సంస్థల పని విధానంలో కూడా ప్రజాస్వామిక పద్ధతులను పాటించాలని అనేవాడు. ఈ ఆలోచనతోనే ఆయన కార్యకర్తల సమావేశం అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఆ విధంగా ఎన్నో మంచి సంప్రదాయాలను నెలకొల్పిన సుబ్బారావు అకాల మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు.

## Anti - Elegy

నేను తుపాకి గుళ్ళకి బలయిపోయిన
స్నేహితుల గురించి రాయను
వాళ్ళ వీరత్వంలో యాదృచ్ఛికతను
మాత్రం గుర్తిస్తాను.

అసాధారణ మరణంతో వాళ్ళు పోగొట్టుకున్న
సాధారణత్వానికి ప్రాణంపోస్తాను.
వెళ్ళిపోయిన వాళ్ళని మనుమల్ని చేసి
మళ్ళీ జీవితంలోకి నడిపించి తీసుకువస్తాను.

నేను బతికున్నవాళ్ళ గురించే
రాస్తాను.



మరిచిపోలేని మరణ గీతాలలో
మరుగున పడిన వైరుధ్యాల్ని
తవ్వితీసి, ఎదుర్కొంటాను.
అనుబంధాన్ని పునర్ నిర్వచించగల
ప్రజాపోరాటాలని ప్రేమిస్తాను.

జీవించగల జీవితం తప్ప
ఇంకేమీ లేనివాణ్ణి
అమరత్వాన్ని కవిత్వంలో
ఆవిష్కరించ నిరాకరిస్తాను.

ఏప్రిల్ 1990 — సి.వి. సుబ్బారావు